సాక్షి
అనంతపురం
మంగళవారం । 25 । జూన్ । 2024



స్థిరంగా చీనీ ధరలు

చీనీ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అనంతపురంలో సోమవారం టన్ను చీనీ కాయలు గరిష్టంగా రూ.32 వేలు పలికాయి.



డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధం

ఉన్నత విద్యా మండలి నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవడంతో డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధం నెలకొంది.

8లో

గరిష్టం/కనిష్టం
37.7°/23.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నిర్భయంగా సమస్యలు తెలియజేయండి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

అనంతపురం: స్వేచ్ఛగా, నిర్భయంగా సమస్యలు తెలియజేయాలని, చట్ట పరిధిలో పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ గౌతమి శాలి తెలిపారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో ఎస్పీ 79 వినతి పత్రాలు స్వీకరించారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను విని అక్కడిక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కర్ రెడ్డి, సీఐ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లిన కలెక్టర్

అనంతపురం అర్బన్: కార్యాలయ పని నిమిత్తం సోమవారం కలెక్టర్ వి.వినోద్‌కుమార్ విజయవాడకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం పనులు ముగించుకుని వస్తారు. బుధవారం తిరిగి విధులకు హాజరవుతారు.

గురుకులాల్లో వెంటనే చేరండి

- విద్యార్థులకు జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ సూచన

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల (అంబేడ్కర్ గురుకులాలు) పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు వెంటనే చేరాలని గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీసీ, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్ మొదటిపేజీ, ఫొటోలు, ర్యాంక్ కార్డ్, అలాట్‌మెంట్ కాపీ తీసుకెళ్లాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు నేటి (మంగళవారం) సాయంత్రం లోగా చేరకపోతే మెరిట్ లిస్ట్‌లో తర్వాత సీరియల్‌లో ఉన్న విద్యార్థులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

జీజీహెచ్‌లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేవలు



సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ కోసం రక్తం అందిస్తున్న రోగి బంధువు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. డెంగీ, మలేరియా తదితర దోమకాటు వ్యాధులతో రోగుల్లో ప్లేట్‌లెట్స్ అమాంతంగా పడిపోతాయి. అటువంటి పరిస్థితుల్లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ (ఎస్‌డీపీ) అందిస్తే ప్లేట్‌లెట్స్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. ప్రైవేట్‌గా ఇటువంటి సేవలు పొందాలంటే రూ.15 వేలకు పైగానే వెచ్చించాల్సి ఉంటుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ మిషన్ ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం రోగులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ నెల 1న బత్తలపల్లికి చెందిన పుష్పలత, 14న ఉరవకొండకు చెందిన మహేష్, 15న అనంతపురం నగరానికి చెందిన శివారెడ్డి, 18న రంగంపేటకు చెందిన వన్నూర్‌బీ ప్లేట్‌లెట్స్ సేవలు పొందారు.

పిచ్చికుక్క స్వైర విహారం

కణేకల్లు: మండల కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన ముగ్గురిపై దాడి చేసి గాయపరిచింది. వివరాలు... సోమవారం ఉదయం పాఠశాలకు వెళుతున్న చిన్నారులు హేమంత్, యాస్మీన్‌పై తొలుత పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. చిన్నారులు ఏడ్చుకుంటూనే స్కూల్‌కు వెళ్లారు. ఉపాధ్యాయుల నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకెళ్లి పిల్లలను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నారు. కొద్ది సేపటి తర్వాత అదే కుక్క ఎర్రిస్వామి అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరచడంతో ఆయన కూడా ఆస్పత్రికి చేరుకుని చికిత్స చేయించుకున్నారు. కణేకల్లులో వీధి కుక్కలు, పిచ్చికుక్కల బెడద తీవ్రంగా ఉన్నా... మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వంట.. తింటే తంటా!

- ఉమ్మడి అనంత జిల్లాలోని హోటళ్లలో దారుణ పరిస్థితులు
- అధ్వానంగా పారిశుధ్యం
- మరిగించిన నూనెలతో ప్రజల ఆరోగ్యం గుల్ల
- అధికారుల తనిఖీల్లో బహిర్గతం



అనంతపురంలోని అరవిందనగర్, రామ్‌నగర్‌లోని రెండు హోటళ్లను గత బుధవారం అధికారులు తనిఖీ చేశారు. ఇడ్లీ, ఇతర టిఫిన్ వంటకాలపై ఈగలు వాలి ఉండడం గుర్తించారు. వేడి ఆహార పదార్థాలను ప్లాసిక్ కవర్లలో పార్శిల్ చేస్తున్నట్లు తేలింది. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా సురక్షిత ప్రమాణాలు పాటించని ఆహారాన్ని మనం తింటామా అని చురకలంటించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకూడదని స్పష్టం చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో..	
రిజిస్టర్ అయిన పెద్ద హోటళ్ల సంఖ్య	150
ఎలాంటి లైసెన్సులూ లేకుండా నడుస్తున్నవి	1,500పైనే
చిన్న బడ్డీ కొట్లు	3,000పైనే
భోజనం మెస్‌లు	250వరకూ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నెలకో, వారానికో హోటల్‌కెళ్లి భోజనం చేయాలనే కుటుంబాలు ప్రస్తుతం వేలల్లో ఉన్నాయి. రోజూ ఇంట్లో తిని బోర్ కొట్టిన ఫ్యామిలీలు వారాంతపు రోజుల్లో రెస్టారెంట్లకెళ్లి తినడం ఇటీవల ఆనవాయితీగా మారింది. కంటికి ఇంపుగా కనిపించే రంగులు, ఘుమఘుమలాడించే పొడులు చల్లి చేసిన వంటకాలకు ఆకర్షితులైన ప్రజలు రెస్టారెంట్లకు క్యూ కడుతున్నారు. అయితే, సంతోషంగా వచ్చే అలాంటి కుటుంబాలకు హోటళ్ల నిర్వాహకులు రోగాలను పరిచయం చేస్తున్నారు.

ఏ హోటల్ కెళ్లినా అంతే..

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 150 వరకూ రిజిస్టర్ హోటళ్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో సుమారు 90 హోటళ్లలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాల అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో హోటళ్ల డొల్లతనం బయటపడింది. అక్కడి అధ్వాన పరిస్థితులు అధికారులను విస్తుగొల్పాయి. ఆహారాన్ని రోజుల తరబడి నిల్వ చేయడం, పదే పదే అదే నూనెను వాడుతూ భోజన ప్రియుల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నట్లు వెల్లడైంది. బయట పూత.. లోపల రోత అన్నట్టు పలు రెస్టారెంట్లు డస్ట్‌బిన్లను తలపించాయి. పారిశుధ్యం అత్యంత దారుణంగా ఉన్నట్టు తేలింది. ముఖ్యంగా మాంసాహార హోటళ్ల కిచెన్లు మురికి కూపాలను తలపించాయి. ఇక్కడ వండిన మాంసమా మనం తింటున్నది అంటూ అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏ హోటల్‌లో చూసినా ఇదే పరిస్థితి. మటన్, చికెన్ వంటివి మిగిలితే వారం, పది రోజుల వరకూ నిల్వ ఉంచి మళ్లీ వాటితోనే ఆహార పదార్థాలను వండి వార్చుతున్నట్లు తెలిసింది.

పదే పదే నూనెలు మరిగించి..

హోటళ్లలో వాడే నూనెలు ప్రమాదకరకంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా కొన్ని నమూనాలు సేకరించి, పరిశీలన చేయగా క్యాన్సర్ కారకాలు ఉన్నట్లు తేలింది. దీంతో పాటు ప్రజలను ఆకర్షించేందుకు ప్రమాదకర కార్సినోజెనిక్ రంగులను వాడుతుండడం గుర్తించారు.

> **తనిఖీలు ముమ్మరం చేస్తాం**
>
> ఇటీవల హోటళ్లలో తనిఖీలు నిర్వహించాం. అక్కడ ఏ మాత్రం పరిస్థితులు బాగాలేవు. 90 శాతం నమూనాలు నెగిటివ్‌గా ఉన్నాయి. ఇప్పటికే చాలా హోటళ్లకు నోటీసులు ఇచ్చాం. తనిఖీలు మరింత ముమ్మరం చేస్తాం. భవిష్యత్తులోనూ పెద్ద ఎత్తున నిర్వహిస్తాం.
>
> – చక్రవర్తి, ఫుడ్ సేఫ్టీ అధికారి



నిల్వ చేసిన మాంసం

కనీస పారిశుధ్యం లేకపోవడం ఒకెత్తయితే నాసిరకం ఆహార పదార్థాలు, నిల్వ ఉంచినవి, మరిగించిన నూనెలతో హోటళ్లు రోగాలకు నిలయాలుగా మారుతున్నట్టు తేలింది. పకడ్బందీగా దాడులు చేయడం, జరిమానాలు విధించడం వంటి చర్యలు లేకపోవడంతో హోటళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



అనంతపురంలో ఓ రెస్టారెంట్‌లో అపరిశుభ్రత

పుడమికి పరీక్ష

- భూసార పరీక్షలకు కసరత్తు
- ఉమ్మడి జిల్లాలో ఈసారి 35,800 నమూనాలు లక్ష్యం
- ఒక్కో నమూనా నుంచి 12 రకాల పోషకాల పరీక్షలు

అనంతపురం అగ్రికల్చర్: భూసార పరీక్షలు భారీ ఎత్తున నిర్వహించడానికి వ్యవసాయశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. అనంతపురం జిల్లా పరిధిలో 18,600, శ్రీ సత్యసాయి జిల్లాలో 17,200... వెరసి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 35,800 మట్టి నమూనాలు రైతుల పొలాల్లో సేకరించి వాటిని ప్రయోగశాలలో పరీక్షించి పోషక ఫలితాలు ఇవ్వాలని టార్గెట్‌గా నిర్ణయించారు. అయితే జిల్లా స్థాయి భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ–ఎస్‌టీఎల్) రెండు జిల్లాలకు కలిపి అనంతపురంలో ఉన్నందున... అదనంగా ధర్మవరం, పెనుకొండలో ఉన్న డివిజన్ స్థాయి కేంద్రాలను కూడా తిరిగి తెరవాలని, అలాగే మూలనపడిన మొబైల్ బస్సును కూడా అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టారు. లేదంటే ఏడాదిలో ఇంత పెద్ద మొత్తంలో మట్టి పరీక్షల నిర్వహణకు కష్టమని చెబుతున్నారు. అందులోనూ ఇప్పటికే ఖరీఫ్ పంటల సాగు ప్రారంభించినందున మట్టి నమూనాలు తీయలేని పరిస్థితి ఉందంటున్నారు. ప్రస్తుతం నల్లరేగడి భూముల్లో నమూనాలు సేకరించడానికి అవకాశం ఉండటం, ఖరీఫ్ ముగిసిన తర్వాత అక్టోబర్–నవంబర్‌లో, అలాగే వేసవిలో మార్చి నుంచి మే వరకు టార్గెట్‌ను పూర్తి చేయడంపై దృష్టి సారించారు. ఆర్‌బీకే అసిస్టెంట్లు, ఏఈఓలు, ఏఓలకు టార్గెట్లు ఇచ్చి ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణ, ల్యాబ్‌కు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



అనంతపురంలోని మట్టి పరీక్షల ప్రయోగశాల

12 రకాల మట్టి పరీక్షలు..

సేకరించిన మట్టిలో పోషకాలకు సంబంధించి 12 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. అందులో పీహెచ్ (భూమి స్థితి) శాతం, ఎలక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పోటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూల పోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించి క్రోడీకరిస్తామని తెలిపారు. దీని వల్ల భూమిలో ఉన్న పోషకాల లభ్యత, అధికం, తక్కువగా ఉన్న పోషకాల ఆధారంగా పంటలను బట్టి సమగ్ర ఎరువుల యాజమాన్యం సిఫారసు చేయనున్నట్లు ఎస్‌టీఎల్ ఏడీఏ ఎల్.రోజాపుష్పలత తెలిపారు. ప్రతి రైతు కనీసం మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. దీని వల్ల భూమి సురక్షితంగా ఉండటమే కాకుండా రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రధానంగా భూమిలో సేంద్రియ కర్బనం పెరగడం వల్ల పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జేడీఏ ఆదేశాల మేరకు రెండు జిల్లాల పరిధిలో భూసార పరీక్షల లక్ష్యం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రాజెక్టులోకి దూకి వదిన, మరిది ఆత్మహత్య

- వివాహేతర సంబంధం బయటపడడంతో అఘాయిత్యం




మృతులు నిజామా, మహబూబ్ బాషా

పెద్దపప్పూరు: వివాహేతర సంబంధం బయటపడడంతో సమాజంలో తలదించుకుని బతకాల్సి వస్తుందని భావించిన వదిన నిజామా (39), మరిది మహబూబ్ బాషా (23) ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పెద్దపప్పూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి కాలనీకి చెందిన జిలాన్ బాషా గుత్తి మండలం బేతాపల్లికి చెందిన నిజామాను వివాహం చేసుకుని అక్కడే జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. సొంత మరిది అయిన మహబూబ్‌బాషాతో నిజామాకు ఏడాదిగా వివాహేతర సంబంధం ఉండేది. ఇది తెలిసిన పలువురు మహబూబ్‌బాషాను మందలించి తాడిపత్రికి పంపారు. అయినా అతను అప్పుడప్పుడు గుత్తికి వెళ్లి వదినతో రహస్యంగా కలుస్తుండేవాడు. మూడు రోజుల క్రితం ఈ విషయం బహిర్గతమైంది. దీంతో అవమానంగా భావించిన వదిన, మరిది చనిపోవాలని నిర్ణయించుకుని ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో పెద్దపప్పూరు మండలం చాగల్లు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ అక్కడే వదిలి ప్రాజెక్టులోకి దూకారు. ద్విచక్ర వాహనం ఉండడాన్ని ప్రాజెక్టు సిబ్బంది గమనించి ఆదివారం రాత్రే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆరా తీయగా ద్విచక్ర వాహనం తన తమ్ముడిదేనని, రెండు రోజులుగా తన భార్య నిజామా, తమ్ముడు మహబూబ్ బాషా కనిపించడం లేదని జిలాన్‌బాషా పోలీసులకు తెలిపారు. కాగా.. సోమవారం ఉదయం చాగల్లు ప్రాజెక్టులోని మొదటి గేటు వద్ద నిజామా మృతదేహం తేలియాడుతుండగా ప్రాజెక్టు సిబ్బంది గమనించి పోలీసులకు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా సిబ్బందితో వెళ్లి గజ ఈతగాళ్ల సహాయంతో నిజామా మృతదేహాన్ని వెలికి తీయించారు. సాయంత్రం మహబూబ్‌బాషా మృతదేహం కూడా బయటపడింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తేజస్వినిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు

అనంతపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అవమానపరిచే రీతిలో వ్యవహరించిన టీడీపీ నాయకురాలు సంఘ తేజస్వినిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవెల్ దేవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జ్ డీఎస్పీ బీవీ శివా రెడ్డికి పార్టీ మహిళా విభాగం నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతపురంలో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం సంఘ తేజస్విని ఆధ్వర్యంలో సభ్య సమాజం తలదించుకునే రీతిలో మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటాన్ని అవమానించారన్నారు. ఆమె వ్యవహారం ఆది నుంచి వివాదాస్పదంగానే ఉందని తెలిపారు. ఏ ఒక్క రోజూ తాము టీడీపీ కార్యాలయం గేటు కూడా తాకలేదని, కానీ నేడు వారు బరితెగించి తమ పార్టీ అధ్యక్షుడినే అవమానించే రీతిలో వ్యవహరించడం సరి కాదన్నారు. గత 5 సంవత్సరాలు తాము ఎంతో హుందాగా వ్యవహరించామన్నారు. తమ ఆరాధ్య దైవాన్ని కించపరుస్తూ వైఎస్సార్ సీపీ నాయకులను రెచ్చగొట్టడం మానుకోవాలని హితవు పలికారు. తక్షణమే సంఘ తేజస్వినితో పాటు ఆమె వెంట ఉన్న మహిళలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉక్కుపాదం మోపాలని విన్నవించారు. ఈ విషయంలో పోలీసులు వెనుకంజ వేస్తే తమ పార్టీ మహిళా కార్యకర్తలతో జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేసేందుకూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నేతలు బి.శ్రీదేవి, కృష్ణవేణి, పార్వతి, భారతి, హాజరాభి, లీలావతి, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, సుమతి, శోభ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు ప్రజల క్యూ
- అధికార పార్టీ నాయకుల బెదిరింపులపై పలువురి ఫిర్యాదు
- అర్జీలకు సత్వర పరిష్కారమే లక్ష్యం: కలెక్టర్ వినోద్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి అర్జీలు సమర్పించారు. వివిధ సమస్యలపై మొత్తం 410 వినతులు అందాయి.

- రాజీనామా చేయాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లను అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్ తెలిపారు. ఉరవకొండ మండలం ముస్తూరు గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్‌ను, విడపనకల్లు మండలం కొటాలపల్లి పరిధిలోని జనార్దన్‌పల్లి, తిమ్మాపురం గ్రామాల్లోని ఆశా వర్కర్లను బెదిరిస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 200 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించారన్నారు. వీఓఏలను తొలగిస్తున్నారన్నారు. స్కీముల్లో పని చేస్తున్న కార్మికులను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.
- దివ్యాంగులకు సంబంధించి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అంధ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సి.రామయ్య విన్నవించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దివ్యాంగ ఉద్యోగుల నియామకాలకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేశారన్నారు. ఈ నేపథ్యంలో శాఖా పరమైన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.
- రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణం వారి ఖాతాల్లో జమ చేయాలనే తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి విన్నవించారు. అలాగే, ఖరీఫ్, రబీ పంటల బీమా ప్రకటించాలన్నారు. కరువు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారమే లక్ష్యం..

ప్రజల నుంచి అందే అర్జీలకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. అర్జీల స్వీకరణ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తగిన సూచనలు, ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అతిసారం' కట్టడికి చర్యలు

జిల్లాలో అతిసారం కట్టడి లక్ష్యంగా చర్యలు చేపట్టామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధిని అరికట్టవచ్చన్నారు.

> **లక్ష మొక్కలు నాటుతాం**
>
> 'చెట్టుకు, మనిషికి అనుబంధం పెంచేలా జిల్లాలో మొక్కల పెంపకాన్ని మహోన్నత కార్యక్రమంలా చేపట్టనున్నాం. లక్ష మొక్కలు నాటడం లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేశాం. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములవ్వాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. రెవెన్యూభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పచ్చదనం ప్రస్తుతం 7.5 శాతం ఉందన్నారు. దీన్ని 33 శాతానికి పెంచే దిశగా పెద్ద ఎత్తున మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టామన్నారు. అటవీ శాఖ పరిధిలోని నర్సరీల్లో 42 జాతులకు సంబంధించి 10 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ భూములు, గుట్టలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఇలా వివిధ ప్రదేశాల్లో లక్ష మొక్కలు నాటనున్నట్లు వెల్లడించారు. తనతో సహా జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడంతో పాటు దత్తత తీసుకుని సంరక్షిస్తామన్నారు. ఇందు కోసం ఒక మొబైల్ యాప్ రూపొందించామన్నారు. మొక్క నాటి, దానిని సంరక్షించడాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ఉపాధ్యాయుడి హఠాన్మరణం



నరసింహులు (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వై.నరసింహులు(52) గుండెపోటుతో మృతి చెందారు. అనంతపురంలోని స్వగృహంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుండెపోటుకు గురైన ఆయనను కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కలచట్ల గ్రామానికి చెందిన నరసింహులు డీఎస్సీ–2002లో ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయనకు భార్య రంగమ్మ, కుమారుడు చక్రవర్తి, కుమార్తె ప్రియాంక ఉన్నారు. నరసింహులు మృతిపై ఏపీటీఎఫ్ నాయకులు దేశాయి నాగరాజు, రామచంద్రుడు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్, మహమ్మద్ బాషా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

క్లుప్తంగా

వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా విజయశంకర్‌బాబు


విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ విజయ శంకర్‌బాబు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ సహదేవరెడ్డిని రాజమండ్రి వ్యవసాయ పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు. ఈ క్రమంలో పులివెందులలోని వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ విజయశంకర్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయ, బాలాజీ ఫర్టిలైజర్ షాపులను సోమవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా విక్రయాలు చేపట్టిన మందులను గుర్తించారు. రూ. 2.23 లక్షల విలువ చేసే మందుల అమ్మకాలను నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ ఫణీంద్రనాథరెడ్డి, వ్యవసాయాధికారి వాసుప్రకాష్, మండల వ్యవసాయాధికారి శ్యామసుందర్‌రెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న విధ్వంసం



కంబదూరు: అధికారమే అండగా చూసుకుని టీడీపీ నాయకులు సాగిస్తున్న విధ్వంసం కొనసాగుతూనే ఉంది. ఆదివారం రాత్రి కంబదూరులోని సచివాలయం-1, ఆర్‌బీకే-1 గేట్లు దూకి లోపలకు ప్రవేశించిన కొందరు టీడీపీ కార్యకర్తలు సచివాలయం, ఆర్‌బీకే గోడలకు ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి దాష్టీకాన్ని తాము చూడలేదని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే ఇలా విధ్వంసాలకు పూనుకోవడం బాధాకరమని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధం

- అడ్మిషన్లపై ఎలాంటి ప్రకటన చేయని ఉన్నత విద్యామండలి
- అయోమయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం
- ఇతర కోర్సుల వైపు విద్యార్థుల మొగ్గు
- అడ్మిషన్లకు ఆఫ్‌లైన్ లేక ఆన్‌లైన్ అని తేల్చుకోలేక పోతున్న విద్యామండలి
- కొత్త ప్రభుత్వం నుంచి రాని కబురు



తాడిపత్రి రూరల్: కొత్తగా యూజీ (డిగ్రీ) కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు అప్పుడే కష్టాలు మొదలయ్యాయి. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటి వరకూ డిగ్రీ అడ్మిషన్లపై ఉన్నత విద్యామండలి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయక పోవడంతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ విద్య వైపు దృష్టి సారించాల్సి వస్తోంది.

ఫలితాలు వెలువడి 73 రోజులు కావస్తున్నా...

ఈ ఏడాది ఏప్రిల్ 12న ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలు వెలువడి దాదాపు 73 రోజులు కావస్తున్నా... నేటికీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలపై స్పష్టత లేకుండా ఉంది. ఈ నెల 18న ఇంటర్ ద్వితీయ సంవత్సర సప్లి ఫలితాలు వెలువడడంతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరూ ఉన్నత విద్యావకాశాలపై దృష్టి సారించారు. ఏటా ఇంటర్ ఫలితాలు వెలువడిన అనంతరం డిగ్రీలో ప్రవేశాలకు విధి విధానాలను ఉన్నత విద్యామండలి రూపొందించి, నోటిఫికేషన్ జారీ చేస్తోంది. దీని ప్రకారం ఆయా కళాశాలల యాజమాన్యం అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతూ వచ్చాయి. గత ఏడాది సైతం జూన్ 20న అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేశారు. సకాలంలో అడ్మిషన్లు చేపట్టినప్పుడే అరకొరగా విద్యార్థులు కళాశాలల్లో చేరుతున్నారని, ఇక ఆలస్యంగా అయితే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందనే ఆందోళన కళాశాలల యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది.

ఆన్‌లైన్ అడ్మిషన్లతో నూతన ఒరవడి..

గతంలో డిగ్రీలో ప్రవేశాలకు ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లను చేపట్టేవారు. దీంతో పట్టణ ప్రాంతాల్లోని కళాశాలలకు డిమాండ్‌కు ఎక్కువగా ఉండేది. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండే కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అరకొరగా ఉండేది. దీంతో వెనుకబడిన విద్యార్థులు చాలా నష్టపోయేవారు. ఈ సమస్య నుంచే విద్యార్థులకు ఊరట దక్కేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్లకు శ్రీకారం చుట్టింది. దీంతో ఆధునిక వసతులున్న కళాశాలలను ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పిస్తూ 2021 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపులు చేయడంతో ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు ఉన్న కళాశాలల్లో చాలా సులువుగా సీట్లు దక్కాయి. అంతేకాక జగనన్న విద్యా దీవెనను సమర్థంగా అమలు చేయడంతో ఉన్నత విద్య ఓ వెలుగు వెలిగింది.

అడ్మిషన్లపై చొరవ చూపని ప్రభుత్వం..

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లపై నూతన ప్రభుత్వం చొరవ చూపడం లేదనే భావన కళాశాలల యాజమాన్యాల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఏపీ మంత్రుల పోర్ట్‌ఫోలియోలో ప్రత్యేకంగా విద్యాశాఖ అని పేర్కొనకపోవడంతో ఈ శాఖ ఎవరికీ కేటాయించలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రత్యేకంగా మానవ వనరుల అభివృద్ధి శాఖగా పేర్కొంటూ ఇందులో పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్య, అక్షరాస్యత పెంపు లాంటి అంశాలను చేరుస్తూ మంత్రిగా నారా లోకేష్‌కు బాధ్యతలను సీఎం చంద్రబాబు కేటాయించారు. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి అధికారులతో చర్చలు జరిపి డిగ్రీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసే దిశగా నారా లోకేష్ ఇప్పటి వరకూ చొరవ చూపకపోవడంతో సర్వత్రా గందరగోళం నెలకొంది. గతంలో కరోనా వల్ల గాడి తప్పిన విద్యా వ్యవస్థను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలతో చక్కబెట్టింది. తనకిచ్చిన శాఖల పట్ల నారా లోకేష్ పూర్తి స్థాయి అవగాహనకు వచ్చిన తరువాత అధికారులతో చర్చలు జరిపి చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తుండడంతో డిగ్రీ అడ్మిషన్లు ఆఫ్‌లైన్‌లో చేపట్టాలా? లేకా ఆన్‌లైన్ ద్వారానా? అనే అంశం తేల్చుకోలేక ఉన్నత విద్యామండలి సందిగ్ధంలో పడింది.

ప్రత్యామ్నాయం వైపు విద్యార్థులు..

డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ జారీలో చోటు చేసుకుంటున్న జాప్యం కారణంగా విద్యాసంవత్సరం కోల్పోవడం ఇష్టం లేని విద్యార్థులు ప్రత్యామ్నాయ కోర్సుల వైపు దృష్టి సారిస్తున్నారు. దీనికి తోడు కళాశాలల యాజమాన్యాలు సైతం నోటిఫికేషన్ ఇప్పట్లో రాదనే భావనతో విద్యార్థులను భయపెడుతున్నాయి. దీంతో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు పలు రకాల కోర్సులతో విద్యార్థులకు గాలం వేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో మొత్తం డిగ్రీ కళాశాలలు	95
ప్రభుత్వ యాజమాన్యంలోని కళాశాలలు	13
ప్రైవేట్ యాజమాన్యంలోని కళాశాలలు	82
గత ఏడాది అడ్మిషన్ పొందిన విద్యార్థుల సంఖ్య	12 వేలు
అన్ని గ్రూపులు కలిపి మొత్తం డిగ్రీ విద్యార్థుల సంఖ్య	25 వేలు
అడ్మిషన్ల జాప్యం ప్రభావం చూపుతున్న విద్యార్థుల సంఖ్య	13 వేలకు పైగా

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

అనంతపురం: కట్టడంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. అనంతపురం మూడో పట్టణ సీఐ ధరణి కిషోర్ తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం పులితిమ్మారెడ్డి పల్లి ఎగువతండాకు చెందిన వెంకటేష్ నాయక్ (60) అనంతపురంలోని నాల్గో రోడ్డులో బిల్డర్ గౌస్ ఖాన్ నిర్మిస్తున్న ఇంటికి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు మొదటి అంతస్తుకు వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తల వెనుక, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించి స్థానికులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం ఆయన మృతి చెందాడు. మృతుడి కుమారుడు రమావత్ కిరణ్‌కుమార్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

26, 28 తేదీల్లో జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్ఎస్ సెక్యూరిటీ, సీయోన్ సమ్మిట్ ఆటోమేటివ్ అనంతపురం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డ్, గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ట్రైనీ, డిప్లొమా ఇంజినీరింగ్ ట్రైనీ ఉద్యోగాలకు ఈ నెల 26, 28 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి ఎ.కళ్యాణి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటలకు జరిగే జాబ్‌మేళాను ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్హత సర్టిఫికెట్లు, ఏదైనా ఐడీ ప్రూఫ్ వెంట తీసుకు రావాలన్నారు. పూర్తి వివరాలకు 90145 28675లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు ప్రారంభం


ఎస్కేయూలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: ఏపీ రీసెట్-2024లో అర్హత పొందిన అభ్యర్థులకు పీహెచ్‌డీలో ప్రవేశాలకు సోమవారం నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్సిటీలకు ఇంటర్వ్యూలు చేపట్టడానికి కొన్ని సబ్జెక్టులు చొప్పున కేటాయించారు. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి కేటాయించిన ఇంగ్లిష్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్సెస్, సెరికల్చర్ సబ్జెక్టుల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్ బోర్డ్‌ఆఫ్‌స్టడీస్ చైర్మెన్ ప్రొఫెసర్ పుత్తా పద్మ , ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. మాధవి, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ప్రొఫెసర్ వైఎస్ శారద, ప్రొఫెసర్ వి.నిర్మల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి.

జేఎన్‌టీయూలో...

జేఎన్‌టీయూఏ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయి. సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్, కెమికల్ విభాగాల్లో చేపట్టిన ఇంటర్వ్యూలను వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఏపీఆర్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, ప్రొఫెసర్ సి.శోభాబిందు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, ప్రొఫెసర్ ఏపీ శివకుమార్ పాల్గొన్నారు.

లారీ దగ్ధం



కూడేరు: ఆకస్మికంగా చెలరేగిన మంటల కారణంగా ఓ లారీ దగ్ధమైంది. పోలీసులు తెలిపిన మేరకు... బళ్లారి నుంచి అనంతపురానికి సిమెంట్ పెళ్ల తయారీకి ఉపయోగించే ఫ్లైయాస్ (బూడిద)తో బయలు దేరిన లారీ సోమవారం వేకువజామున కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్దకు చేరుకోగానే మంటలు చెలరేగాయి. వేగానికి లారీ వెనుక టైర్లు వేడెక్కడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ చంద్రశేఖర్ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఫైరింజన్లు అక్కడకు చేరుకునే లోపు లారీ పూర్తిగా కాలిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చీనీ, దానిమ్మకు చీడపీడలు


కొత్తచిగురు తినే పురుగు ఆశించడంతో చీనీ ఇలా


బ్యాక్టీరియా మచ్చతెగులు కారణంగా దెబ్బతిన్న దానిమ్మ కాయ

- నివారణ చర్యలు చేపట్టండి
- ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్

అనంతపురం అగ్రికల్చర్: తాజా వాతావరణ పరిస్థితుల్లో చీనీ, దానిమ్మకు ఆశించిన చీడపీడల నివారణపై దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా రైతులకు ఉద్యానశాఖ శ్రీసత్యసాయి జిల్లా డీడీ జి.చంద్రశేఖర్ సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ విస్తీర్ణంలో ఉన్న చీనీ తోటలు, దానిమ్మ తోటల్లో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు.

చీనీలో సస్యరక్షణ చర్యలు ఇలా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం చీనీ తోటల్లో సీజన్ కాయ ఎదుగుదల దశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తగా చిగుర్లు వచ్చాయి. వచ్చే గైరంగం పంట మంచి దిగుబడులు రావాలంటే చిగుర్లు ఆరోగ్యంగా పెరిగేలా కాపాడుకోవాలి. అయితే చాలా తోటల్లో రెక్కల పురుగులు ఆశించి చిగుర్లను తినేస్తున్నాయి. అలా జరిగితే వచ్చే సీజన్‌లో పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటికి 0.3 గ్రాముల థయోమిథాక్సామ్ కలిపి పిచికారీ చేయాలి. అలాగే అక్కడక్కడ పాముపాడ (లీఫ్‌మైనర్) పురుగులు ఆశించి పత్రహరితాన్ని హరింపజేస్తున్నాయి. దీని నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ అబామిక్టిన్ బెంజోయేట్ కలిపి పిచికారీ చేయాలి. కొత్త చిగుర్లు పగిలి లేత ఆకులు ఏర్పడే దశలో 15 రోజుల వ్యవధిలో సిఫారసు చేసిన మోతాదులో సూక్ష్మధాతువుల మిశ్రమాన్ని రెండు సార్లు పిచికారీ చేయాలి.

దానిమ్మలో ఇలా...

దానిమ్మ తోటలు చాలా వరకూ వాడు దశ నుంచి పంటకు వెళ్లే దశలో ఉన్నాయి. పూత పిందె దశలో ఉన్న తోటల్లో ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు సోకే ప్రమాదముంది. ప్రధానంగా బ్యాక్టీరియా మచ్చతెగులు విషయానికి వస్తే... ఆకులు, కాయలపై కాటుక రంగులో 'వై' ఆకారపు మచ్చలు ఏర్పడి పగుళ్లు వస్తాయి. నివారణకు ఒక శాతం బోర్డో మిశ్రమాన్ని పిందెలు ఉన్న తోటల్లో పిచికారీ చేయాలి. కొత్తగా పంటకు వెళ్లే తోటల్లో జాగ్రత్తగా కత్తిరింపులు చేయాలి. పూత దశలో ఉన్న తోటల్లో లీటర్ నీటికి 3 మి.లీ జీవశిలీంధ్రనాశిని సూడోమోనాస్ కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు పిచికారీ చేసిన తర్వాత 10 నుంచి 15 రోజుల వరకు మరే ఇతర మందులు పిచికారీ చేయకూడదు. అక్కడక్కడ రబ్బరు పురుగు ఆశించి కొత్త చిగుర్లను తింటూ నష్టం కలగజేస్తోంది. లీటర్ నీటికి 10 వేలు పీపీఎం కలిగిన 1 మి.లీ వేపనూనె + 2 మి.లీ కార్బోసల్ఫాన్ కలిపి పిచికారీ చేయాలి. ఇటీవల కురిసిన తొలకరి వర్షాలకు జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద, ఉలవలు లాంటి పచ్చిరొట్ట (గ్రీన్‌మెన్యూర్స్) విత్తనాలు చల్లి 60 రోజుల వయస్సులో భూమిలో కలియదున్నితే సేంద్రియ పోషకాలతో భూసారం పెరుగుతుంది.

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడండి

- కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

అనంతపురం అర్బన్: గృహహింస నుంచి మహిళలకు విముక్తి కల్పించి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. గృహహింసకు వ్యతిరేకంగా జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. సమాజంలో ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు ఏదో ఒకసారి గృహహింస ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితులు తలెత్తకుండా వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గృహహింస బాధితులు తక్షణ సాయం కోసం మహిళ శిశు సంక్షేమ శాఖలోని గృహహింస విభాగాన్ని లేదా ఉమెన్ హెల్ప్‌లైన్ 181ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేలు ఇవ్వాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

అనంతపురం అర్బన్: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. రైతులకు ఇచ్చి హామీ మేరకు వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరింది. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జున మాట్లాడారు. రైతుల సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ఈ నెల 27న తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. కౌలు రైతులకు సాగు సాయం కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.3 లక్షల వరకు వడ్డీ లేని పంట రుణం, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీ రుణం అందించాలన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి, వేరుశనగ, కంది, తదితర విత్తనాలు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలన్నారు. టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రకటించిన రుణమాఫీ నాలుగు, ఐదు విడతల బకాయిలను ఇప్పుడైనా విడుదల చేయాలన్నారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలు సాగిస్తామన్నారు. సమావేశంలో నాయకులు వన్నారెడ్డి, రామకృష్ణ, బండిరామకృష్ణ, వి.టి.ఆంజనేయులు, నీళపాల రామకృష్ణ, చలపతి పాల్గొన్నారు.

విధుల్లో నుంచి తొలగిస్తామంటున్నారు

- టీడీపీ నేతల బెదిరింపుపై పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నిరసన


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు(క్లాప్ మిత్రలు)గా పనిచేస్తున్న తమను కొత్త వారిని నియమించుకుంటామని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఏఐయూటీయూసీ జిల్లా నాయకుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.అశోక్ మాట్లాడుతూ... పంచాయతీల పరిధిలో అతి తక్కువ వేతనం రూ.6 వేలతో కొన్నేళ్లుగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కొద్ది నెలలుగా వీరికి వేతనం కూడా చెల్లించలేదన్నారు. అయినా తమ విధులు కొనసాగిస్తున్నారన్నారు. వీరిని తొలగించే ఆలోచన చేయడం సరికాదన్నారు. ఏ ఒక్క కార్మికుడిని తొలగించినా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం బెదిరింపులపై చర్యలు తీసుకోవడంతో పాటు క్లాప్ మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ జేసీ కేతన్ గార్గ్‌కు వినతి పత్రం అందజేశారు.

టీడీపీ నేతల ఇసుక దందా.. 16 టిప్పర్ల పట్టివేత


పెద్దవడుగూరు పోలీసులకు పట్టుబడిన టిప్పర్లు


పామిడిలో పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

పెద్దవడుగూరు/పామిడి: టీడీపీ నేతల ఇసుక దందా గుట్టు రట్టయింది. పెద్దవడుగూరు మండలం కొండూరు గ్రామ శివారులోని పెన్నానది నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 16 టిప్పర్లు, హిటాచీ యంత్రాన్ని పోలీసులు సీజ్ చేశారు. పెద్దవడుగూరు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... కొండూరు గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం వేకువజామున అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో టిప్పర్లలో ఇసుకను లోడ్ చేస్తున్న హిటాచీతో పాటు ఏడు టిప్పర్లు పట్టుబడ్డాయి. వాహనాలను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ఇసుక అక్రమ తరలింపులపై ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పామిడి పోలీసులు సోమవారం వేకువజాము 2 గంటలకు పామిడి - కొండూరు మార్గంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన 9 టిప్పర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో పామిడికి చెందిన టీడీపీ నాయకుల ఆదేశాలతోనే తాము ఇసుక తరలిస్తున్నట్లుగా డ్రైవర్లు అంగీకరించినట్లు తెలిసింది. మొత్తం 16 టిప్పర్లు, ఓ హిటాచీని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌టీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



పీవీ శ్రీనివాసులు, గోపాలప్ప

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం ఈ ఎంపిక ప్రక్రియ జరిగింది. రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.హరికృష్ణ, జి. ప్రేమనాథరెడ్డి, బి నాగేంద్ర, ఎస్. రాంభూపాల్ రెడ్డి, ఆర్ నారాయణ నాయక్, ఎస్. వి. ఎస్ .శరత్ పామర్, అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పీవీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా హెచ్. గోపాలప్ప, గౌరవాధ్యక్షుడిగా పి. బాలసుబ్రహ్మణ్యం, సహాధ్యక్షుడిగా ఎస్. వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా ఎ. ఆదిశేషయ్య, ఎస్. వేణుగోపాల్, బి. ఈరాలప్ప, టి. జోష్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్. ఖలందర్, ఆర్థిక కార్యదర్శిగా పి. అల్లాబకాష్, కార్యదర్శులుగా పి. వహీద్, కె. ఖాజావలి, పి .మహబూబ్ ఖాన్, బి .రాఘవేంద్ర, కె శర్మాస్ వలి, ఆర్.నాగరాజు, జె.తిమ్మరాజు ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

పరామర్శ



చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

అనంతపురం కార్పొరేషన్: బుక్కరాయస ముద్రం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆదిలక్ష్మి కుటుంబంపై టీడీపీ నాయకులు వేట కొడవళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. దాడికి గల కారణాలపై ఆరా తీశారు. భయపడాల్సిన పని లేదని వారిలో ధైర్యాన్ని నింపారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, గెలుపోటములు సహజమన్నారు. ఈ ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.

బసంపల్లిలో వైద్య శిబిరం



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో సోమవారం 104 వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో షుగర్, బీపీతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అలాగే పలువురు గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే అందులో దోమలు పెరిగి రోగాలు వ్యాప్తి చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



విద్యార్థిని ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కమలా నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో 'ఫస్ట్ స్టెప్ స్కిల్స్' సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. జస్టిక్ కన్‌స్ట్రక్షన్స్, స్కిల్ డిజైర్, హీరో మోటార్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆరుగురు విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల చైర్మన్ ఎస్‌హెచ్ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దామోదర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.షెక్షావలి, పవన్ కుమార్, వెంకటేశ్వర్లు, వెంకన్న, చలపతి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న ఎంఈఓ రామాంజనేయులు

ఆత్మకూరు: మండలంలోని 14 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలందరూ బడిలో ఉండాలి. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా బడికి పోదాం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈఓ-2 రామాంజనేయులు తెలిపారు. మండలంలోని సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు బడికి రాని పిల్లలను గుర్తించాలని సూచించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల్ని బడిలో చేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చినట్లు వెల్లడించారు. అంతేకాకుండా మండలంలోని పిల్లలు బడికి కాకుండా పనికి వెళ్తుంటే అధికారులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

జోరుగా పారిశుధ్య పనులు



అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామంలో సోమవారం పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ సెక్రటరీలు మల్లేష్, ఖాదర్‌వలి గ్రామంలో అపరిశుభ్రత నెలకొన్న ప్రదేశాలను గుర్తించి మురికి నీటిని శుభ్రం చేయించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు.

కల్యాణం.. కమనీయం





అరవింద నగర్‌లోని శివాలయంలో శివపార్వతులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, పూజల్లో పాల్గొన్న భక్తులు



అలంకరణలో శివపార్వతులు

అనంతపురం కల్చరల్: స్థానిక అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. రెండు రోజుల పాటు సాగిన ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ఉదయం పార్వతీ పరమేశ్వరులకు రుత్వికులు భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గురుమూర్తి స్వామి నేతృత్వంలో కల్యాణంలోని అన్ని ఘట్టాలను సంప్రదాయ సిద్ధంగా సాగాయి. గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్ర మహాస్వామీజీ విశిష్ట అతిథిగా విచ్చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. స్వయంగా శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన భక్తి మార్గంపై మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతత ఇస్తుందన్నారు. అందరూ భక్తిమార్గంలో నడవాలని సూచించారు. సాయంత్రం నగర వీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు నయనానందకరంగా సాగింది. శివనామస్మరణతో వీధులు మార్మోగాయి. జంగమయ్యల శివకళారూపాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా వివిధ దేవతామూర్తుల వేషధారణల్లో దీపం పట్టుకున్న అమ్మవారిగా కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాద వినియోగం జరిగాయి.





శివపార్వతుల విగ్రహాల ఊరేగింపులో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఓ కళాకారుడి విన్యాసం



వీరగాసే నృత్యం చేస్తున్న దృశ్యం

రోడ్డుపై చెత్త కనిపించకూడదు



మారుతీనగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: రోడ్డుపై చెత్త కనిపించకూడదు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసి చెత్తను కంపోస్టుయార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని మారుతీనగర్, కోవూర్‌నగర్, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. నిర్దేశిత సమయంలో చెత్తను తరలించాలన్నారు. ప్రజలు సైతం సామాజిక స్పృహతో చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయరాదని సూచించారు. నగరపాలక సంస్థ వాహనాలకు చెత్తను అందించాలన్నారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

అనంతపురం కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థలో కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 11 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ప్రజారోగ్యాధికారి, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అదనపు కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, డీసీపీ మారుతిహరిప్రసాద్, ఈఈ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదు ముతవల్లీలుగా షఫీవుల్లా, షకీల్

అనంతపురం కల్చరల్: జామియా మసీదు, దాని అనుబంధ సంస్థల ముతవల్లీలుగా కేఎం షఫీవుల్లా, షకీల్‌షఫీ నియమితులయ్యారు. ఈ మేరకు రెండు రోజుల క్రితమే వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షాషావలి ఉత్తర్వులు జారీ చేశారు. కేఎం షఫీవుల్లా విలేకరులతో మాట్లాడుతూ.. పాతూరులోని జామియా మసీదుతో పాటూ ఈద్గా మైదానం, పలు మసీదులు, షాపింగ్ కాంప్లెక్సులు, గుత్తి రోడ్డు, టీవీ టవర్ వద్ద ఉన్న వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

రాప్తాడు: డయేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గీతావాణి, తహసీల్దార్ సీతారామ్, వైద్యాధికారి శివ కృష్ణ పేర్కొన్నారు. అతిసార వ్యాధితో ఏ ఒక్కరూ బాధపడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో డయేరియాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై క్యాంపెయిన్ చేపట్టాలని ఆదేశించారు. డయేరియా నియంత్రణ కార్యక్రమాలకు అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల నిర్వహణపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులకు సూచనలిచ్చామని పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు డయేరియా సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి పరిశుభ్రత, కాలుష్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి డయేరియా కేసులను అరికట్టాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. మంచి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇళ్ల నుంచి ఇళ్ల నుంచి చెత్త సేకరణ, డ్రైనేజీల్లో పూడిక తీయాలని తెలిపారు. ఫాగింగ్ చేపట్టడం, దోమలు, కీటకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎంఈఓ మల్లికార్జున, నాగరత్న, హేమలత, ఈఓఆర్డీ మాధవి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రాప్తాడు: 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో తీవ్రమైన కరువు పరిస్థితులు, సకాలంలో వర్షాలు రాకపోవడంతో రైతులు పూర్తిగా నష్టపోయారని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. కరువు నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించినా పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతులా ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఖరీఫ్, రబీ పంటల బీమా ప్రకటించి, పెట్టుబడి సాయం కుటుంబం ఆధారంగా కాకుండా, ఎకరాల ఆధారంగా కనీసం ఎవరాకు రూ.10 వేల చొప్పున 10 ఎకరాలకు వరకు ఇవ్వాలన్నారు. ప్రతి రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించాలని కోరారు. వ్యవసాయ పంపు సెంట్లకు మీటర్లు బిగించే జీఓ నంబర్ 22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, నాయకులు సుబ్బా రెడ్డి, పెద్దన్న, లింగన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజనా దేవి ఆరాధనోత్సవం



అలంకరణలో అంజనా దేవి విగ్రహం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోనక్షేత్రం అభివృద్ధికి పరితపించిన పవిత్ర యోగినిమాత అంజనాదేవి ఆరాధనోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే గోపూజ, గంగపూజతో పాటు ధ్వజారోహణం చేపట్టారు. అనంతరం అంజనా దేవి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భజన చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. అనంతరం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల స్థాయి అధికారులకు జిల్లా స్థాయి అధికారులు పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

వైఎస్ జగన్‌తో పలువురి భేటీ



వైఎస్ జగన్‌ను కలసిన పార్టీ రాష్ట్ర నాయకుడు హరీష్‌కుమార్ యాదవ్



వైఎస్ జగన్‌తో బాబా సలామ్

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సోమవారం పులివెందులలోని ఆయన నివాసంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు షేక్ బాబాసలామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థి సమస్యలపై ముందుంటూ పోరాడాలని వైఎస్ జగన్ సూచించినట్లు బాబా సలామ్ తెలిపారు.

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సోమవారం పులివెందులలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు హరీష్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నారాయణ విద్యా సంస్థలను సీజ్ చేయాలి



నారాయణ కళాశాలలో విక్రయిస్తున్న పుస్తకాలతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా నారాయణ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఓబులేష్, ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను రూ.10-15 వేల వరకు అమ్ముతున్నారన్నారు. దీనిపై జిల్లాలో ఉన్న ఆర్ఐఓకు అనేక సార్లు ఆధారాలతో సహా విన్నవించినా కనీసం విచారణ చేయలేదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల వైపు కన్నెత్తి కూడా చూడలేదని మండిపడ్డారు. నారాయణ విద్యాసంస్థలకు అనుకూలంగా పని చేస్తున్న ఆర్ఐఓను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్, వంశీ, ఆనంద్, పవన్, హర్ష, కార్తీక్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, గిరి, సూర్య, శివ ప్రకాష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీ అరికట్టాలి



బైక్ ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు ఉల్లికల్లు రమణ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకూ సాగింది. కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉల్లికల్లు రమణ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా పుస్తకాలు, అడ్మిషన్ల పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థలు అక్రమ వసూళ్లు చేస్తున్నాయన్నారు. కొత్త కొత్త ఆకర్షణీయమైన ఐపీఎల్, ఐకాన్, సీ-బ్యాచ్, టెక్నో, జెడ్‌ఏఫ్‌టీబీ, కోస్పార్క్, సూపర్ చైనా తదితర పేర్లతో బ్యాచ్‌లు ఏర్పాటు చేసి అధిక ఫీజుల దందా సాగిస్తున్నారన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేకసార్లు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నటువంటి విద్యా సంస్థలపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేపీ నారాయణ స్వామి, ఉల్లికల్లు చిన్న పెద్దన్న, నాగేష్, రాజు, గంగాధర్, రామకృష్ణ, జయప్రకాష్, మురళి, పక్కీరప్ప, మారుతి పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథుడికి పూజలు



పూజలందుకున్న కాశీ విశ్వనాథుడు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే దేవాలయంలోని స్వామి మూల విరాట్‌కు మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేశారు.

బైక్, ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం బైక్, ఆటో ఢీ కొన్నాయి. ఘటనలో విష్ణు, రఘు అనే ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. గుత్తికి చెందిన వారు బైక్‌లో వ్యాపిలికి వెర్తుడగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొన్నారు. గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎరువులు, మందుల వివరాలు తెలపాలి

గార్లదిన్నె: మండలంలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల ధరల పట్టిక, ఎరువులు, మందులు వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు అక్బర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపులో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన ఎరువులు , మందులు విక్రయించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ సోమశేఖర్‌కు అందజేశారు. ఆ సంఘం నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎర్రితాత స్వామి ఆరాధనోత్సవాలు

బొమ్మనహాళ్‌/బెళుగుప్ప: మండల కేంద్రంలోని శాంతిధామంలో సద్గురు ఎర్రితాతస్వామి 88వ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామికి ఉదయం నుంచి సహస్ర మూలికా పంచామృతాభిషేకాలు, రుద్ర, గణపతి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా స్వామి శేషతల్ప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామి ప్రభోత్సవాన్ని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ప్రత్యేక పూజలతో స్వామి ప్రభోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రభోత్సవాన్ని మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, చెక్క భజనలతో పురవీధుల గుండా శాంతిధామం వరకు నిర్వహించారు. ఎస్ఐ శివ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉట్లపరుష, ఆలయంలో ప్రత్యేక భజనలు, కోలాటాలు ఉంటాయి.